# 14. వీలునామా

పొడుగాటి అందమైన మనిషి – రౌనీ బౌర్నివాల్‌ను ఎరుగుదును. ముఖంలో ఎప్పుడూ విచారం తాండవిస్తూండేది. ప్రతి చిన్న విషయానికీ కోపగించు కుంటూండేవాడు. లోకంలోని కుళ్ళును కడిగెయ్యటమంటే అతనికి ఎంతో ఉత్సాహం!

అతను చాలాసార్లు అనేవాడు. "విషపూరితమైన మనుషులంటూ ఉండరు. వాళ్ళకన్న హీనుల్ని చూసినప్పుడు మాత్రం మనకలా అనిపిస్తూ వుంటుంది!"

అతనికి మిసూరియస్, కౌర్సిల్స్ అనే సోదరులు వున్నారు. పేర్లలోగల భేదాన్ని పట్టి వాళ్ళిద్దరూ ఇంకో తండ్రి సంతానమని నేను అనుకునేవాణ్ని. రౌనీ వాళ్ళిద్దర్నీ తప్పించుకొని తిరుగుతూండేవాడు. ఏదో విపరీతమైన తమాషా సంఘటన ఆ కుటుంబంలో జరిగిందని మాత్రం అప్పుడప్పుడు వింటూండేవాణ్ని. దాని వివరాలు మాత్రం నాకు తెలియవు.

రౌనీ అంటే నాకెంతో యిష్టం ఉండటం వల్ల త్వరలోనే మా యిద్దరి మధ్యా స్నేహం బాగా పెరిగిపోయింది. ఒకనాటి సాయింత్రం నేను "నువ్వు మీతల్లి మొదటిభర్త పుత్రుడివా? లేక రెండో భర్త పుత్రుడివా?" అని అడిగాను.

అతని ముఖం తెల్లపడ్డది. నా ప్రశ్న అతన్ని కలచివేసి వుంటుంది. బాధతో మనిషి కుంగుకుపోయాడు. కొన్ని క్షణాలు గడిచాక యీ పరిస్థితిని తట్టుకోగలిగాడు. అతని విచారకరమైన ముఖంలో తమాషా చిరునవ్వు మొలకెత్తింది.

అన్నాడు : "నీకు విసుగు లేకుండా ఉంటే నా జీవితంలో జరిగిన అపురూప సంఘటనల్ని చెప్తాను. నువ్వు అర్థం చేసుకోగలవనీ, తప్పక సానుభూతి చూపగలవనీ,

ఆ సంఘటన మన స్నేహాన్ని దూరం చెయ్యదనీ నా నమ్మకం. ఒకవేళ అది మన స్నేహానికి ముప్పు తెచ్చినట్టయితే - నిన్ను నా స్నేహితుడిగా ఇక చూడలేను."

అతను యీ కింది కథను చెప్ప నారంభించాడు:

మా అమ్మ - మాడమ్‌కౌర్సిల్స్ - చాలా బీదకుటుంబంలోనిది. ఆమె అందగత్తె. లజ్జావతి - ఆ రెండు గుణాల ఆధారంతోనే ఆమె భర్త ఆమెను పెళ్ళాడాడు. ఆమె జీవితమంతా నరక సమానంగానే గడిచిపోయింది. ప్రేమించి పూజించగల ఆమె ప్రకృతిని భర్త ఎన్నడూ గ్రహించలేదు. ఊళ్ళోమాత్రం ఆయన పెద్దమనిషిగానే చలామణీ అయ్యేవాడు. పరిస్థితులు యథాతథంగా ఉన్నట్లయితే ఆయనే నా తండ్రి అయ్యేవాడు.

వారి వివాహం అయిన నెలకల్లా - ఆయన తన పనిమనిషితో రాత్రులు గడపటమే కాకుండా, ఇరుగు పొరుగు కుటుంబాలలోని అందగత్తెలు చాలా మందితో ఆయనకు సంబంధం ఉండేది. ఏమైనా ఆయన భార్యద్వారా ముగ్గురు పిల్లల్ని కనక తప్పలేదు - అంటే నన్ను కూడా ఒకడిగా లెక్కకట్టే పక్షంలో! మా అమ్మ - తన భర్త ప్రవర్తనకు నోరు విప్పేదికాదు. గల్లంతుగా గడిచే జీవితంతో, మోతతో తలనెప్పిపుట్టే ఆ ఇంట్లో ఒక చిట్టిఎలుకవలె జీవితాన్ని గడిపేది.

పరిస్థితులు ఇలావున్నా ఆమె నరాల బలహీనత్వంతో నిరాశతో బాధపడుతూ - మెరిసే కళ్ళనుంచి వెలువడే అశాంతిదృక్కుల్తో చూసేది. ఆ చూపులు - విపరీతమైన భయంతో ఒణికిపోతూ ఏ విధంగానూ ఆ భయాన్ని వొదిలించుకోలేని మృగం చూసే చూపుల్లాటివి. ఐనా ఆమె మహాఅందగత్తె అని అందరూ ఒప్పుకునేవాళ్ళు. ఆ పాడు భయంవల్ల మాత్రం ఆమె శిరోజాలు తమ రంగును పోగొట్టుకున్న వనుకుంటాను.

మాన్సియర్ కౌర్సిల్స్ స్నేహితుల్లో చాలామంది ముఖ్యులు మా యింటికి చాలాసార్లు వొస్తూండేవాళ్ళు. అందులో మాన్సియర్ బౌర్నివాల్ అనే ఆయన ఒకడు. ఆయన పూర్వం మిలిటరీలో వున్నతోద్యోగం చేశాడు. భార్య చనిపోయింది. అతన్ని చూస్తే అందరికీ భయంగా ఉండేది కాని అతని హృదయం అతి సున్నితమైంది. అతను శారీరకంగానూ మానసికంగానూ కూడా బలిష్ఠుడు. తను చేయ నిశ్చయించిన పనిని సాధించితీరే స్వభావం గలవాడు. అతను పొడుగ్గా, సన్నగా నల్లని మీసకట్టుతో మెరిసి పోతూండేవాడు. నేను అతని పేరునే ధరించి ఉన్నాను. అతని పోలికలు నాలో చాలా ఉన్నవి.

అతను ఎంతో చదివినవాడు. ఆ తరగతి మనుషుల్లో చాలామందితో అతని అభిప్రాయాలు భేదిస్తవి. అతని ముత్తవ్వ ప్రసిద్ధిగన్న రచయిత్రి. ఆమె ఉన్నతాభిప్రాయాల్ని అతను పూర్తిగా జీర్ణించుకోగలిగాడు. సాంఘిక దురాచారాల్నీ, మూఢనమ్మకాల్నీ ఏవగించుకొనేవాడు. సమయం దొరికినప్పు డల్లా బలమైన తిరుగుబాటు చేసేందుక్కూడా వెనుకంజ వేసేవాడు కాదు.

క్రమంగా అతనూ మా అమ్మ అన్యోన్యానురాగంలో పడ్డారు. వారి ప్రేమకలాపాలు అతి నిగూఢంగా సాగిపోతూండటంవల్ల వాటిని ఊహించే అవకాశం కూడా ఎవరికీ లేకపోయింది. బాధ్యత తెలియని భర్తతో బాధపడుతూ నిరాశతో కుంగిపోతూ, జీవితంలో సౌఖ్యాన్నే చవిచూడని ఆమె అతన్ని దైవస్వరూపుడిగా భావించి అతి ప్రేమతో అతనిలో లీనమైపోయి ఉండేది. క్రమంగా అతని ఉన్నతాదర్శాలూ, తాత్విక ఆలోచనలూ, సాతంత్ర్యం కోసం పడే తహతహా ఆమెకు అలవాటుపడినయ్. కాని ఆమె పైకి మాట్లాడలేనంత మెత్తనిది కనుక సద్గుణాలన్నీ వెనక్కుపోయి, కుంచించుకొని ఆమె హృదయాంతరాళంలోనే ఉండిపోయినయ్.

నా ఇద్దరు సోదరులకూ తండ్రి పోలికలే వొచ్చినయ్. అందుకనే వాళ్ళు తల్లిని ప్రేమించటానికి మారుగా ద్వేషిస్తూ, బాధిస్తూండేవాళ్ళు. ఆమె ఇంట్లో ఊరికినే తింటూ తిరుగుతూండటాన్ని వాళ్ళు భరించలేకపొయ్యే వాళ్లు. ఆమెను తల్లిగా కాకుండా ఒక పనిగత్తెగా చూసేవాళ్ళు. ఆమె సంతానంలో నేనొక్కణ్ణే ఆమెను తల్లిరూపాన ప్రేమించి పూజించేవాణ్ని. దానికి ప్రతిఫలంగా ఆమె నన్నొక్కణ్ణే కన్నకుమారుడిలాగు ప్రేమతో చూడ గలిగేది.

ఆమె చచ్చిపొయ్యేప్పటికి నాకు పదిహేడేళ్లు. అంతకు ముందునుంచీ ఆమెకూ ఆమె భర్తకూ మధ్య కోర్టులో వ్యాజ్యం జరుగుతూ వుంది. వారి ఆస్తి భాగాలు పడ్డది. ప్లీడరు తెలివితేటలవల్లా, ప్రభుత్వ చట్టాల న్యాయంవల్లా - మా అమ్మ భాగానికి వొచ్చిన ఆస్తిని - ఆమె ఇష్టంవచ్చిన వ్యక్తి పేర పెట్టవొచ్చని తీర్పులో చెప్పబడ్డది.

ప్లీడరు దగ్గర వీలునామా వుందనీ, అది వినేందుకు రమ్మనీ మాకు కబురు వొచ్చింది. ఈ విషయం నిన్ననే జరిగినంత విపులంగా నాకు జ్ఞాపకం వుంది. అదివొక పెద్ద విశాలమైన నాటకదృశ్యం లాటిది. జీవితమంతా తన భర్త పొరపాట్లవల్ల కలిగిన బాధను నిశ్శబ్దంలోనే భరిస్తూ కుంగిపోయిన ఆమె ఇక భరించలేక తన సమాధి లోతుల్లోనుంచి, గొంతెత్తి అరుస్తూ తన సంపూర్ణాధికారాన్నీ, స్వాతంత్ర్యాన్నీ సాధిస్తూన్నట్టు తోచింది.

నాకు తండ్రినని అపోహపడే లావాటి ఆ పెద్దమనిషి - గుండ్రని కందగడ్డలాటి ముఖంతో కూర్చున్నాడు. ఆయన మొహం చూస్తే కసాయివాడు వెంటనే జ్ఞాపకం వొస్తాడు. నా ఇద్దరు సోదరులూ - భారీ మనుషులేనని చెప్పక్కర్లేదు!- కుర్చీలలో కూర్చొని వీలునామా వినేందుకు సిద్ధంగా ఉన్నారు. మాన్సియర్ బౌర్నివాల్ కూడా యీ సందర్భంలో ఆహ్వానింపబడ్డాడు. అతను నా వెనుకనే నిలబడి ఉన్నాడు. అతని ముఖం పాలిపోయివుంది. తెల్లబడుతూన్న మీసాన్ని బాధగా దువ్వుతున్నాడు. జరగబొయ్యే దుర్ఘటనకు అతను సిద్ధంగా ఉన్నట్టు ముఖకళ చెప్తూనేవుంది. ప్లీడరు

తలుపులన్నీ తాళాంవేసి ఒక పెద్ద సీలువేసిన కవరు బైటికి తీశాడు. లోపల ఏముందో ఆయనక్కూడా తెలియదు...

నా స్నేహితుడు చెప్పటంమాని, బరువుగా గాలిపీల్చి డ్రాయరులోంచి పాతకవరు నొకదాన్ని లాగి, ఒకసారి కళ్ళుమూసుకొని భక్తితో దాన్ని ముద్దాడి అన్నాడు. "ఇప్పుడు నేను చదువబొయ్యేది నా మాతృమూర్తి రాసిన వీలునామా–

లియోపాల్డ్ జోసఫ్ కౌర్సిల్స్‌కు భార్యనైన – ఏనీకాథరైన్ మెటిల్డా అనే నేను – శారీరకంగానూ, మానసికంగానూ దృఢంగా ఉన్నప్పుడు యీ నా తుదికోరికల్ని వెలిబుచ్చుతున్నాను:

మొట్టమొదట భగవంతుణ్నీ, ఆ తరువాత నా ప్రియ పుత్రుడు రౌనీనీ నేను చెయ్యబొయ్యేపనికి క్షమించమని కోరుతున్నాను. నా కుమారుని హృదయం విశాలమైనదనీ, నన్ను అర్థం చేసుకోగలడనీ గట్టిగా నమ్ముతున్నాను. నేను జీవితమంతా బాధలోనే గడిపాను. నా వివాహం అనుకోకుండానే జరిగిపోయింది. నా భర్త చేత ద్వేషించబడుతూ, అతని పాదాలకింద నలుగుతూ, అతను పవిత్రవివాహాన్ని నేలదన్ని చేసిన అత్యాచారా లన్నింటినీ భరిస్తూ పడి ఉన్నాను. అందుకు నేను అతన్ని క్షమిస్తున్నాను. అతనికి నేనేమీ ఋణపడలేదు.

నా పెద్దకుమారు లిద్దరూ నన్నసలు తల్లివలె చూసేవాళ్ళే కాదు. నా జీవితంలో వాళ్ళిద్దరూ నన్నెప్పుడూ ప్రేమించి ఉండలేదు. అందుకని వాళ్ళక్కూడా నేనేమీ ఋణపడలేదు.

రక్త సంబంధమనేది దైనందిన ప్రేమలో మిళితమయ్యేదిగా ఉండాలి. కృతజ్ఞతలేని కుమారుడికన్నా ముఖం ఎరుక లేని మనిషి ఎన్నుకోతగ్గవాడు. అలాటి దుష్టుడైన కుమారుడు నైతికంగా గొప్ప నేరస్థుడు. ఎందుకంటే కన్నతల్లిని లెక్కచెయ్యకుండా నీచంగా చూచే హక్కు ఏ కొడుక్కూ లేదు.

న్యాయసమ్మతం కాని చట్టాల్నీ, మానవత్వమేలేని ఆచారాల్నీ, సిగ్గుపడాల్సిన ద్వేషాగ్నినీ ఆరాధించే మనుషులంటే నేను ఆపాదమస్తకమూ భయంతో ఒణికి పొయ్యేదాన్ని. ఒక్క భగవంతునిముందు మాత్రం నేను నిర్భయంగా ఉండగలను. నేను చనిపోబోతున్నాను. హృదయాంతరాళంలోని యీ విప్లవాగ్నిని నేనిక భరించలేను. ఈ సంఘానికి భయపడుతూ లోలోపల కుళ్ళుతూన్న నా హృదయాన్ని వెలిబుచ్చే సమయం ఇంతకన్న మరి దొరకదు.

నాకు న్యాయచట్టం యిచ్చిన నా ఆస్తిపాస్తుల్ని –నా ఇష్టానుసారంగా వినియోగపరుచుకునే హక్కును పొందిన నేను – ఆస్తినంతటికీ పెర్రీ – జెన్నిన్ – సైమన్ – బౌర్నివాల్‌ను అధికారిగా నిర్ణయిస్తున్నాను; మా కుమారుడు రౌనీబౌర్ని వాల్ పెద్దవాడయ్యాక యీ ఆస్తినంతట్నీ అనుభవించే హక్కును పొందుతాడు.

న్యాయాన్యాయాల్ని నిజంగా తెలిసున్న ఆ భగవంతుని ముందు నేను యీ సత్యాన్ని మాత్రం ఒప్పుకుంటున్నాను : నేను బౌర్నివాల్ ప్రేమలో అనుభవించిన ఆనందం ఒక్కటే నా జీవితంలో విలువైనది. అతని నిశ్చలప్రేమ, మానవ సమానత్వంలోని మాధుర్యాన్ని రుచిచూపిన అతని ఉన్నతాశయాలూ - వీటిని నేను మరువలేను. యీ ప్రాణులన్నీ ఒక దాన్నొకటి ప్రేమించుకుంటూ, ఓదార్చుకుంటూ, ద్వేషభావాల్ని పక్కకునెట్టి కలిసి మెలిసి జీవిస్తూ - విచార సమయాల్లోనూ, దుర్ఘటనల్లోనూ, దురదృష్టాల్లోనూ విడిపోకుండా ఉండటమే సృష్టికర్త ఉద్దేశించి ఉంటాడనే నిగూఢ సత్యాన్ని బౌర్నివాల్ కౌగిలిలో కనుక్కోగలిగాను.

మాన్సియర్ కౌర్సిల్స్ నా ఇద్దరు పెద్దకుమారులకూ తండ్రి. ఒక్క రౌనీ మాత్రమే బౌర్నివాల్ కుమారుడు. యీ తండ్రీ కుమారుల్ని సాంఘిక ద్వేషాలకు దూరంగా ఉంచమని నేను భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారిద్దరూ జీవితాంతంవరకూ కలిసిమెలిసి ఉంటూ, నన్ను నా మృతశయ్యమీద ప్రేమించమని కోరుతున్నాను.

ఇవే నా చివరి ఊహలు. అంత్యకోర్కెలు.

- ఏనీ కాథరైన్ మెటిల్డా

వీలునామా చదవటం పూర్తికాగానే మాన్సియర్ కౌర్సిల్స్ లేచి నిలబడి "ఇది వొక పిచ్చిది రాసిన వీలునామా ఐఉండాలి" అని అరిచాడు.

యీమాట వినగానే మాన్సియర్ బౌర్నివాల్ ముందుకు వొచ్చి అన్నాడు; "సైమన్ బౌర్నివాల్ అయిన నేను - ప్రమాణంచేసి ఇదంతా కాచివడబోసిన సత్యమని చెప్తాను. ఇంకేమైనా రుజూ కావాలంటే - మా మధ్య జరిగిన ప్రణయలేఖలే చాలు."

వెంటనే మాన్సియర్ కౌర్సిల్స్ బౌర్నివాల్ దగ్గరగా వెళ్ళాడు. నాకుమాత్రం ఇద్దరూ కలియబడబోతున్నా రనిపించింది. ఒకరు లావు, ఇంకోరు సన్నం - సమానమైన ఎత్తుగల ఇద్దరు పురుషులు ఏ కారణానో కాని ఒణుకుతూ ఒకరి కెదురుగా ఒకరు నిలబడి వున్నారు.

కౌర్సిల్స్ అన్నాడు : "నువ్వొక వ్యభిచారివి-"

ఎండుకుపోయిన గొంతుతో పెద్దగా బౌర్నివాల్ జవాబు చెప్పాడు : "మనిద్దరం ఇంకో తావులో కలుసుకుందాం. వికారమైన నీ ముఖంమీద టపాకాయపేల్చి ద్వంద్వయుద్ధానికి ఇంతకుముందే ఆహ్వానించి ఉండేవాణ్ణి. కాని జీవితమంతా అమితబాధకు గురైన యీ అమాయకురాలి మనశ్శాంతిని - అందులోనూ ఆమె మరణశయ్య వద్ద జరగకూడని యీ అక్రమచర్యతో పాడుచేయదలచలేదు."

అతను వెంటనే నా వైపు తిరిగి అన్నాడు : "నువ్వు నా కుమారుడివి - మరి నాతో వొస్తావా? నిజానికి నిన్ను తీసుకువెళ్ళేహక్కు నాకులేదు, కాని నువ్వు నీ తండ్రి దగ్గరకు వొచ్చేందుకు ఇష్టపడతావని నమ్ముతాను."

నేనేమీ జవాబు చెప్పకుండా అతనితో చెయ్యికలిపాను. ఇప్పటికే మూడుభాగాలు పిచ్చివాడిగా మారిన నన్ను తన కౌగిలిలోకి లాక్కున్నాడు.

రెండురోజులు గడిచాక, ద్వందయుద్ధంలో బౌర్నివాల్ - కౌర్సిల్స్‌ను చంపాడు. సంఘటన బైటపడితే పాడుపేరు ఊరంతా మోగుతుందని భయపడి తమ నోళ్ళకు తాళాలు వేసుకున్నారు. నా తల్లి నాకు వొదిలిన ఆస్తిలో సగభాగాన్ని నా సోదరులకు ఇచ్చాను - వాళ్ళు వెనుకా ముందూ ఆలోచించకుండానే తీసుకున్నారు. నిజానికి నాది కానిదీ, కాని చట్టం నాకు ఇచ్చిందీ ఆ పాతపేరును విసర్జించి-బౌర్నివాల్ పేరునే స్వీకరించాను. మూడు సంవత్సరాల క్రితమే మాన్సియర్ బౌర్నివాల్ మరణించాడు. ఆ దుఃఖం నాలో ఇంకా మిగిలే వుంది-"

❋ ❋ ❋

లేచి నిలబడి గదిలో అటూ ఇటూ పచారుచేస్తూ - నా ముందుకొచ్చి నిలబడి సూటిగా నా ముఖంలోకి చూస్తూ "నేను నమ్ముతాను - నా తల్లి రాసిన వీలునామా పరమ పవిత్రమైనదనీ, న్యాయబద్ధమైనదనీను. ఏ స్త్రీ చెయ్యలేని పనిని ఆమె చేసినందుకు నేను అభినందించగలను. నువ్వే మంటావు?" అన్నాడు.

నేను చేతులు రెండూ ముందుకుజాచి "తప్పకుండా ఒప్పుకుంటాను. ఆమె ఉన్నతాదర్శాన్ని నేను హృదయపూర్వకంగా మెచ్చుకుంటాను" అన్నాను.